
లయ తప్పుతోంది

■ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు
■ జీవన శైలిలో మార్పులే కారణం
■ నేడు ప్రపంచ హృద్రోగ దినం



నంద్యాల పాత పట్టణం, కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే

కార్డియోథొరాసిక్ విభాగంలో శస్త్రచికిత్సల వివరాలు

సంవత్సరం	మైనర్	మేజర్
2023	549	328
2024 (సెప్టెంబరు)	543	232

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది మంది గుండె జబ్బులబారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏటా సుమారు 25 వేల మంది చికిత్స పొందుతున్నారు. మరికొందరు సకాలంలో వీటిని గుర్తించలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్క కర్నూలు సర్వజన ఆస్పత్రికి ప్రతి నెలా కొత్తగా 120 గుండె జబ్బు కేసులు వస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ భారీగా నమోదవుతున్నాయి. ఆదివారం ప్రపంచ హృద్రోగ దినం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

నందికొట్కూరుకు చెందిన రంగమ్మ (85) ఆయాసంతో బాధపడుతూ స్థానికంగా వైద్యుడికి చూపించారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఊపిరితిత్తుల్లో నీరు చేరిందంటూ రెండు రోజులు చికిత్స అందించారు. వైద్యంతోపాటు మందులకు సుమారు రూ.80 వేలు బిల్లు వేశారు. చివరికి ఆమె పరిస్థితి బాగాలేదంటూ చేతులెత్తేయడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూలు సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఐసీయూలో చేర్పించి అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.

● కర్నూలు పెద్దాస్పత్రే ఆధారం

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆస్పత్రుల్లో గుండె జబ్బులకు సంబంధించి వైద్య చికిత్సలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఫలితంగా చాలామంది కర్నూలు సర్వజన ఆస్పత్రిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ వైద్యాలయంలోని కార్డియాలజీ విభాగంలో ప్రతినెలా ఓపీ 1,400, ఐపీ 300 వరకు ఉంటోంది. ప్రతినెలా 50 నుంచి 70 యాంజియోగ్రామ్‌లు చేస్తున్నారు. 20 నుంచి 25 వరకు స్టెంట్లు వేస్తున్నారు.

సర్వజన ఆస్పత్రిలో సేవలు ఇలా..


కార్డియోథొరాసిక్ విభాగంలో ప్రతి నెలా ఓపీ 200, ఐపీ 20 నుంచి 30 నమోదవుతోంది. ఇక్కడ ప్రస్తుతం ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ఉన్నారు. గుండె శస్త్రచికిత్సలన్నీ రెఫరల్ లేదా ఇతర ఆస్పత్రుల నుంచే ఎక్కువగా వస్తున్నాయి. ఓపీ నుంచి కేసులు తక్కువగా వస్తుండటం గమనార్హం. జూనియర్ సర్జన్ ఉన్నప్పటికీ శస్త్రచికిత్సల థియేటరు వద్దకు రానీయడం లేదన్న విమర్శలున్నాయి.

ప్రథమ చికిత్సతో సరి..

నంద్యాల సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ కార్డియాలజీ ఓపీ రోజుకు 30 నుంచి 45 వరకు ఉంటుంది. అత్యవసర కేసులు వచ్చినా కేవలం ప్రథమ చికిత్స అందించి కర్నూలుకు పంపేస్తున్నారు. కర్నూలుకు వెళ్లలేనివారు నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ లేరు. దీనికితోడు శస్త్రచికిత్స నిపుణులు, ఫిజీషియన్ల కొరత వేధిస్తోంది. అవసరమైన వైద్యులతోపాటు క్యాథ్‌లాబ్ అందుబాటులో ఉంటే రోగులకు ఎంతో మేలు జరుగుతుంది.

పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ

గతంలో 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే గుండెపోటు వచ్చేది. ప్రస్తుతం 25 ఏళ్లవారు సైతం దీని బారినపడుతున్నారు. జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం.. పని ఒత్తిడితో చాలామంది ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 10 నుంచి 13 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 8 శాతం మంది గుండె జబ్బుల బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.



లక్షణాలు గుర్తించాలి

– డా.చంద్రశేఖర్, కార్డియాలజీ నిపుణులు




చెమటలు పట్టడం.. ఎడమ చేయి లాగడం ఇతర లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. గుండెలో నొప్పి వచ్చినప్పుడు కొందరు గ్యాస్ట్రిక్ సమస్య అని నిర్లక్ష్యం చేస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం. కొవిడ్ తర్వాత గుండె జబ్బు సమస్యలు ఎక్కువయ్యాయి. కరోనా కారణంగా పలువురిలో ఊపిరితిత్తులు దెబ్బతినడంతో శరీరానికి ఆక్సిజన్ సరిగా అందడం లేదు. ఫలితంగా గుండెపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతోంది.

కొత్త సర్కిళ్లు.. మెరుగవనున్న సేవలు

● నంద్యాలలో నూతనంగా ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లా పునర్విభజన జరిగి రెండున్నరేళ్లు కావొస్తోంది. ఏపీఎస్పీడీసీఎల్ సెక్షన్ విభజన మాత్రం జరగలేదు. నేటికీ కర్నూలు సెక్షన్ కిందే నడుస్తోంది. ఫలితంగా వినియోగదారులకు వివిధ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి సారించింది. ప్రజల సౌకర్యార్థం కర్నూలు కేంద్రంగా ఉన్న విద్యుత్తు సర్కిల్ కార్యాలయాన్ని విభజించి నంద్యాల కేంద్రంగా మరో సర్కిల్ ఏర్పాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరిగానే డివిజన్లు ఉంటాయి. ఇటీవల కొత్తగా ఏర్పడిన ఎమ్మిగనూరు డివిజన్‌ను కర్నూలుకు, ఆత్మకూరు డివిజన్‌ను నంద్యాల సర్కిల్‌లో విలీనం చేశారు.

సిబ్బంది విభజనకు సన్నాహాలు



ప్రస్తుతం కర్నూలు సర్కిల్ పరిధిలో అన్ని విభాగాల్లో కలిపి 4,200 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిని కర్నూలు, నంద్యాల సర్కిళ్ల వారీగా విభజించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిబ్బంది నియామకంపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ముందుగా సిబ్బందిని సర్కిళ్ల వారీగా కేటాయించి.. అక్కడి నుంచి డివిజన్ల వారీగా కేటాయించే అవకాశముంది.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : గృహ నిర్మాణ లబ్ధిదారులు మార్చి 15లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని చక్రం కాలనీ లేఅవుట్‌లో శనివారం మన ఇళ్లు-మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మార్చి తర్వాత ప్రధానమంత్రి 2.0 పథకం మొదలవుతుందని తెలిపారు. ఈ కొత్త పథకంలో పాత లబ్ధిదారులకు అవకాశం ఉండదన్నారు. మార్చి తర్వాత బిల్లులు మంజూరు కావన్నారు. ఆత్మకూరు చక్రం సమీపంలోని లేఅవుట్‌లో 1208 ఇళ్లు మంజూరవగా 133 మాత్రమే నిర్మించుకున్నట్లు చెప్పారు. ఇక్కడ జాతీయ రహదారి నిర్మాణంలో 131 ఇళ్లు పోయాయని, వారికి న్యాయం చేస్తామన్నారు. లబ్ధిదారులు పలు సమస్యలు విన్నవించారు. మెప్మా పీడీ వెంకటసుబ్బయ్య, శ్రీశైల దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ శివరామిరెడ్డి, తెదేపా పట్టణ, మండల అధ్యక్షులు వేణుగోపాల్, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



కాలనీలోని బురద దారిలో వెళుతున్న కలెక్టర్ రాజకుమారి



అహోబిలంలో ఏకాదశి వేడుకలు

అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి ఊరేగించారు. ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపారు. – న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)



మహిళల సమస్యలు వింటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ప్రతి సమస్య పరిష్కరిస్తాం

బనగానపల్లి న్యూస్‌టుడే : ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం బనగానపల్లిలోని తెదేపా కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసరమైన సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు.

శ్రీశైలం జలాశయం నీటిమట్టం 879.60 అడుగులు


సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 879.60 అడుగులు, నీటినిల్వ 185.9926 టీఎంసీలుగా నమోదైంది. ఎగువనున్న జూరాల నుంచి 1,17,928, సుంకేసుల నుంచి 4,446 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 37,763 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

పొడిగిస్తారా.. ముగిస్తారా

■ రీసర్వే డీటీల రెండేళ్ల పదోన్నతి గడువు పూర్తి

భూ రీసర్వే పేరుతో గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. క్షేత్రస్థాయిలో తలెత్తే వివాదాలు, సమస్యల పరిష్కారానికి రీసర్వే డీటీ పోస్టులను తెరపైకి తెచ్చింది. రెండేళ్ల కాల పరిమితితో 'సూపర్ న్యూమరీ' పోస్టులు సృష్టించింది. మరోవైపు రీసర్వే గందరగోళంగా మారింది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకమైంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రీసర్వే ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ రీసర్వే ప్రక్రియను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో భూ రీసర్వే డీటీలుగా నియమితులైనవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



రాష్ట్ర వ్యాప్తంగా 22-09-2022న 679 మంది సీనియర్ అసిస్టెంట్లను రీసర్వే డీటీలుగా అప్పటి వైకాపా ప్రభుత్వం కొత్త పోస్టుల్లో నియమించింది. కర్నూలు జిల్లాలో 25 మండలాలు, ఒక అర్బన్ మండలం కలిపి 26 మండలాలకు 26 మంది, నంద్యాల జిల్లాలో 29 మండలాలకు 29 మంది రీసర్వే డీటీలను నియమించారు. రెవెన్యూ డివిజనల్, తహసీల్దారు కార్యాలయాల్లోని సీనియర్ సహాయకుడి పోస్టులు తాత్కాలికంగా రద్దు చేసి రీసర్వే డీటీ పోస్టులను సృష్టించారు. ఇందులో భాగంగా సీనియర్ సహాయకుడు/ఎంఆర్‌ఐలకు తాత్కాలిక పదోన్నతి కల్పించారు. రెండేళ్ల కాల పరిమితితో ఇచ్చిన పదోన్నతి గడువు ఈనెల 22తో ముగిసింది. ప్రస్తుత నెలకు సంబంధించి 22 రోజులకు జీతం బిల్లు ఆమోదం తెలపాలంటూ జిల్లా ఖజానా శాఖ నుంచి సంబంధిత ఉప ఖజానా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పదోన్నతి గడువు పొడిగిస్తారా? లేదా? అన్న సందిగ్ధం నెలకొంది.

నిర్దిష్ట విధులేవీ..

ప్రతి మండలానికి ఒక రీసర్వే డీటీ పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి దృష్ట్యా ఈ ఏడాది ఏప్రిల్ నుంచే భూ రీసర్వే ప్రక్రియ ఆపేశారు. అప్పటి నుంచి వారికి నిర్దిష్టమైన విధులు లేవు. కొందరు రీసర్వే డీటీలను కలెక్టరేట్లలోని వివిధ సెక్షన్లలో.. మరికొంత మందిని సంబంధిత మండల తహసీల్దార్లు తమ పరిధిలో ఏదో పని చేయించుకుంటూ గడిపేస్తున్నారు. ప్రస్తుతం వారికి జీతాల సమస్య తలెత్తింది.

నెల రోజుల వేతనం ఇవ్వండి

ఈనెల 22తో భూ రీసర్వే డీటీల గడువు ముగిసినా నెల రోజుల వేతనం ఇవ్వాలని జిల్లా ఖజానా శాఖ అధికారులకు జేసీ డా.బి.నవ్య లేఖ రాశారు. వారిని కొనసాగించకుంటే 8 రోజుల వేతనం రికవరీ చేయించేలా తాము కంట్రోలింగ్ అధికారిగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల ఎస్డీవోలకు మార్గదర్శకాలు పంపాలని ఖజానా శాఖ డీడీకి సూచించారు.

● తహసీల్దారు కార్యాలయాల్లో డీడీవోలుగా ఉన్న ఉప తహసీల్దార్లు రీసర్వే డీటీలకు సెప్టెంబరు వేతనం మంజూరు చేయాలని కోరుతూ డిక్లరేషన్ ఫారాలు ఇవ్వనున్నారు. జేసీ ఆదేశాలతో మండలాల డీడీవోలు (డీటీలు) మళ్లీ బిల్లులు పంపుతున్నారని జిల్లా ఖజానా శాఖ డీడీ రామచంద్రరావు తెలిపారు.

కొనసాగిస్తే సరి.. లేకుంటే

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భూముల రీసర్వే ఆపేసింది. మరి రీసర్వే డీటీలను కొనసాగిస్తుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వారిని కొనసాగించకుంటే మళ్లీ సీనియర్ సహాయకులుగా వెనక్కు రానున్నారన్న చర్చ సాగుతోంది.

జగన్ తీరు సిగ్గుచేటు

పగిడ్యాల, న్యూస్‌టుడే : కల్తీ నెయ్యి వినియోగించి తిరుపతి లడ్డూలను అపవిత్రం చేయడం ద్వారా వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన జగన్‌రెడ్డి తన పాపాలను కప్పిపుచ్చుకొనే ధోరణిలో వ్యవహరిస్తుండటం సిగ్గుచేటని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ధ్వజమెత్తారు. పగిడ్యాల మండల పరిధిలోని తమ స్వగ్రామమైన పాత ముచ్చుమర్రిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో వసతుల కల్పనకు కృషిచేస్తామన్నారు. గత వైకాపా ప్రభుత్వం నాస్తికులకు తితిదే ఛైర్మన్ పదవిని కట్టబెట్టి హిందూ మత సంప్రదాయాలను దెబ్బతీసిందని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌కు తిరుమల శ్రీవారిపై ఏమాత్రం గౌరవం లేదని ఆమె విమర్శించారు. తాను ఏ మతాన్ని ఆచరిస్తున్నారో చెప్పేందుకు జగన్ ఎందుకు ఆలోచిస్తున్నారని ప్రశ్నించారు. జగన్ తీరుతో రెడ్డిగా నేను సిగ్గుపడుతున్నానని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు శేషమ్మ, తెదేపా నాయకులు వెంకట్రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్‌గౌడు, విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.



సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

RAMOJI FILM CITY

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

కోర్టు కొత్త భవనం ఏర్పాటుకు వినతి



జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావును సన్మానిస్తున్న సభ్యులు

బనగానపల్లి, న్యూస్‌టుడే : జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమస్యలు పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావుకు బనగానపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం ఇచ్చినట్లు అధ్యక్షుడు ఖాజ ఉశేన్ తెలిపారు. ఆయన శనివారం కర్నూలుకు రాగా.. కలిసి సమస్యలను విన్నవించుకున్నట్లు తెలిపారు. కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకుందని కొత్త భవనం ఏర్పాటు చేయాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కొంత కాలంగా ప్రధాన న్యాయమూర్తి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఖాజా ఉశేన్ వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ ఖైర్, వెంకటేశం, ఉల్లా ఉద్దీన్, శ్రీనివాసమూర్తి, ఆజం ఉశేన్, ఇర్ఫాన్ అబ్బాస్, మహబూబ్‌బాషా, షేక్షావలి పాల్గొన్నారు.

గోరుకల్లులో 11 టీఎంసీల నీరు నిల్వ



గోరుకల్లు జలాశయాన్ని పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా, అధికారులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : గోరుకల్లు జలాశయంలో 11 టీఎంసీల నీటిని నిల్వ ఉంచినట్లు సీఈ కబీర్‌బాషా తెలిపారు. మండలంలోని గోరుకల్లు జలాశయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. నిల్వ వివరాలు, జలాశయం నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఈ ఏడాది జలాశయంలోకి అత్యధికంగా 11 టీఎంసీల నీరు చేరిందన్నారు. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు ప్రస్తుతం 1500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీరు వృథా కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఈ శుభకుమార్, డీఈ అశ్వర్థనారాయణ, ఏఈలు అమృత్‌సాగర్, రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

అహోబిలం అభివృద్ధికి కృషి చేస్తా



జ్ఞాపిక చూపుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం అభివృద్ధికి తాను అన్నివిధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. అహోబిలానికి జాతీయ ఉత్తమ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం అవార్డు దక్కడంతో ఇన్‌టాక్ ఛాప్టర్ సభ్యుడు కిడాంబి సేతురామన్ శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అహోబిలానికి జాతీయ అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. పర్యాటకశాఖ మంత్రితో మాట్లాడి అహోబిలం క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

○ అహోబిలానికి జాతీయ ఉత్తమ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం అవార్డు దక్కడానికి కృషి చేసిన నంద్యాల ఇన్‌టాక్ ఛాప్టర్ కన్వీనర్ శివకుమార్, సభ్యుడు కిడాంబి సేతురామన్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ అభినందించారు.

అత్యాచార బాధితులకు సత్వర న్యాయం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : దాడులు, అత్యాచారానికి గురైన ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.రాజకుమారి చెప్పారు. నంద్యాల సెంటినరీ హాల్‌లో శనివారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో భూములు గుర్తించి శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నంద్యాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్ని మండలాల్లో ప్రతినెలా చివరి తేదీ పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. నందికొట్కూరు, ఆత్మకూరు, ఉయ్యాలవాడ, ప్యాపిలి మండలాల్లో కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న కేసులపై పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలన్నారు. జిల్లాలో గతేడాది వరకు నమోదైన 156 కేసులకు సంబంధించి 278 మంది బాధితులకు రూ.3.90 కోట్ల నష్ట పరిహారంగా అందించినట్లు వివరించారు. ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గీయులపై అత్యాచారాలకు సంబంధించిన కేసులను దాదాపు పరిష్కరించామన్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు సలోమి, ఎన్.రమేశ్, జీవన్‌రాజు, దిలీప్‌రాజు, శ్రీనివాసులు, మమత, ఆర్డీవోలు, డీఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుర సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీ వర్గీయుల వాగ్వాదం



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలక సర్వసభ్య సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపిన అంశాలనే అమలు చేయాలని ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మరోవైపు ఛైర్మన్‌కు తెలియకుండా ఎలాంటి తీర్మానాలు ఆమోదం పొందడానికి వీల్లేదని ఎంపీ వర్గానికి చెందిన ఛైర్మన్ దాసి సుధాకరరెడ్డి కమిషనర్‌ను ఆదేశించారు. నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్ పార్కులో శనివారం నిర్వహించిన పురపాలక సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. పురపాలక కార్యాలయ నూతన భవనాన్ని పట్టణానికి 2 కి.మీ దూరంలో అనువుగాని చోట నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. దానిని ఆపేసి ప్రస్తుత కార్యాలయ భవనం స్థానంలోనే కొత్త నిర్మాణం చేపట్టేందుకు పంపించాలని కమిషనర్ బేబీకి టేబుల్ అజెండా కింద వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై రెండువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఛైర్మన్ కలగజేసుకుని కార్యాలయ భవన నిర్మాణానికి ఎన్ని నిధులు మంజూరయ్యాయని ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులను అడిగారు. రూ.2.30 కోట్లు రాగా ఇప్పటి వరకు రూ.60 లక్షల వరకు వ్యయం చేసినట్లు వారు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అజెండాలోని అంశాల్లో కొన్నింటిని ఆమోదిస్తున్నట్లు ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తాము మాట్లాడుతుండగా మధ్యలో ఎంపీ వర్గానికి చెందిన కౌన్సిలర్లు అడ్డు తగులుతున్నారని ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు కల్పించుకుని సర్దిచెప్పారు. ఈసందర్భంగా ఛైర్మన్ దాసి సుధాకరరెడ్డి మాట్లాడుతూ.. పురపాలక సంఘానికి రూ.9 కోట్ల ప్రత్యేక నిధులు వచ్చాయని చెప్పారు. వాటిలో రూ.7 కోట్లను ఉపయోగించాల్సిన వాటికి కాకుండా ఇతర పనులకు వినియోగించారని విమర్శించారు. ఇందుకు కౌన్సిలర్ భాస్కరరెడ్డి కల్పించుకుంటూ నిధులు పక్కదారి పడుతుంటే ఛైర్మన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. పక్కదారి పట్టిన నిధులను ఏ పనులకు ఉపయోగించారో పూర్తి వివరాలు ఇవ్వాలని కౌన్సిలర్ రాజు కమిషనర్‌ను డిమాండ్ చేశారు. అల్లూరు వద్ద ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ నుంచి పైపులైన్ వేసి ఎస్ఎస్ ట్యాంకుకు నీరు తరలించేలా అంచనాలు తయారు చేస్తే నిధులు మంజూరు చేస్తామని ఎంపీ ప్రకటించినట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దసరాకు 758 ప్రత్యేక బస్సులు

కడప, న్యూస్‌టుడే : దసరా సందర్భంగా కడప ఆర్టీసీ జోన్ (కడప, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నంద్యాల) పరిధిలో 758 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు శనివారం వెల్లడించారు. ప్రత్యేక బస్సులు అక్టోబరు 4 నుంచి 11వ తేదీ వరకు నడుస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచుతామని, సాధారణ టిక్కెట్ ఛార్జీలే వసూలు చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి 285, బెంగళూరు నుంచి 224, విజయవాడ నుంచి 76, చెన్నై నుంచి 40, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు 133 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పండగ అనంతరం అక్టోబరు 13వ తేదీ నుంచి తిరుగు ప్రయాణానికి 596 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడకు 73, హైదరాబాద్‌కు 215, బెంగళూరుకు 253, చెన్నైకి 23, ఇతర ప్రాంతాలకు 32 చొప్పున బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

రేబిస్ టీకా తప్పనిసరి



పాల్గొన్న జిల్లా వైద్యాధికారి డా.వెంకటరమణ తదితరులు

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే : కుక్క కాటుకు గురైన వారు తప్పనిసరిగా రేబిస్ టీకా వేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటరమణ సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా నంద్యాల డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, గుండె జబ్బులున్న వారు, గర్భిణులు కూడా ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా టీకా వేయించుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి ఆసుపత్రిలో టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. డా.జగదీశ్‌చంద్రరెడ్డి, డా.కాంతారావునాయక్, డా.శ్రీజ, డా.ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో వ్యక్తిపై దాడి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : డోన్ గ్రామీణ పోలీస్‌స్టేషన్ సివిల్ పంచాయతీలకు అడ్డాగా మారింది. ఓ కేసు విషయంలో శేషసైనా ఆచారి అనే వ్యక్తిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఏఎస్సైలు, సిబ్బంది ఉండగానే పోలీస్‌స్టేషన్‌లో తెదేపా నాయకుడు ఓబులాపురం శేషిరెడ్డి అతనిపై దాడి చేశాడు. దీంతో అతని కంటి వద్ద తీవ్ర గాయమైంది. 2011లో శేషిరెడ్డి, శంకరయ్య కలసి ట్రేడింగ్ వ్యాపారం చేసేవారు. కొంతకాలం తర్వాత వీరిద్దరి మధ్య వ్యాపార లావాదేవీల విషయంలో విభేదాలు వచ్చి విడిపోయారు. శేషిరెడ్డికి పెద్దమొత్తంలో నగదు రావాలని వారం క్రితం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శంకరయ్య, ఇతని కుమారుడు శేషసైనా ఆచారిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. వ్యాపారానికి, నాకు ఎలాంటి సంబంధం లేకున్నా నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారని శేషసైనా వాపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శేషిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాకేష్ పేర్కొన్నారు

రహదారుల విస్తరణ పనులు ప్రారంభం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో రహదారుల విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. దేవస్థానం ఆసుపత్రి ముందుభాగం నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ టెలికాం ఆఫీస్, జగద్గురు సత్రం, అన్నపూర్ణ భవన్ ఉత్తరం వైపు వరకు పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. రూ.30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ ప్రాంతాల్లో రోడ్లు ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి దేవస్థానం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.



బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట చేపట్టిన పనులు

వెయ్యి మంది విద్యార్థులకు వణుకు



నంద్యాల పట్టణం టెక్కెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు విద్యుత్తు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భవనం గోడకు ఇనుప కాసారాన్ని అమర్చి తీగలు ఏర్పాటు చేశారు. నియంత్రిక నుంచి నేరుగా కళాశాల భవనం గోడకు విద్యుత్తు లైను ఏర్పాటు చేశారు. కళాశాలలో వెయ్యిమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యుత్తు తీగల వల్ల వర్షాకాలంలో తరగతి గది గోడలకు విద్యుత్తు ప్రసారం జరుగుతోందని అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

గుర్రం జాషువా జయంతి వేడుకలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని పింగళి సూరన శాఖ గ్రంథాలయంలో శనివారం మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలను జిల్లా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా, భగత్‌సింగ్‌ల చిత్రపటాలకు నంద్యాల జిల్లా సాహితీ స్రవంతి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, సభ్యులు వెంకటరమణమూర్తి, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, నరేంద్ర, కొప్పుల ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువాకు సాహితీ స్రవంతి సభ్యుల నివాళి

గూడ్సురైలు ఢీకొని వ్యక్తి మృతి

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం నందిపల్లె రైల్వేస్టేషన్ వద్ద శనివారం తెల్లవారుజామున గూడ్సు రైలు ఢీకొని పాలకొల్లుకు చెందిన నటరాజ్ (46) మృతి చెందారని రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు. బళ్లారి నుంచి పాలకొల్లుకు రైలులో వెళుతూ నందిపల్లె రైల్వేస్టేషన్‌లో రైలు ఆగడంతో కిందికి దిగిన ఈయన్ను గూడ్సురైలు ఢీకొని మృతి చెందారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : సమస్య : నూనెపల్లె పరిధిలోని సత్యనారాయణ స్టోర్ వద్ద ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. – ఫక్కీరయ్య, స్థానికుడు

సమస్య : పట్టణంలోని సాయిబాబానగర్ ప్రాంతంలో కాల్వలు సరిగా శుభ్రం చేయడం లేదు. – ఈశ్వర్

సమాధానం : సిబ్బందికి సూచించి రోజూ చెత్త తీసుకెళ్లేలా చూస్తాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం.
– లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్



ప్రశంసాపత్రాలు అందుకున్న క్యూఆర్టీ సిబ్బందితో ఎస్పీ

జిల్లాలో తక్షణ స్పందన బృందాల ఏర్పాటు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా తక్షణ స్పందన బృందాల (క్యూఆర్టీ)ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా చెప్పారు. నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో శిక్షణ పొందిన క్యూఆర్టీ బృందాలకు ఆయన శనివారం ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ప్రతి సబ్ డివిజన్‌కు 11 మందితో క్యూఆర్టీ బృందాలుగా ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

శివాలయంలో చోరీ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనక వైపు ఉన్న శివాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పూజారి శరత్‌కుమార్‌శర్మ రాత్రి 8.30 గంటల సమయంలో ఆలయానికి తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగ ఇనుప కడ్డీతో తాళం పగులగొట్టి ఆలయం లోపలికి ప్రవేశించి హుండీలోని రూ.30 వేలు ఎత్తుకెళ్లినట్లు పూజారి వెల్లడించారు. శనివారం ఉదయం దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై వెంకటనారాయణరెడ్డి వెల్లడించారు.

పేదల గృహం.. పూర్తయ్యే మార్గం

☛ ఎన్టీఆర్ ఇళ్లకు బిల్లులు ఇవ్వనున్న ప్రభుత్వం ☛ క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న అధికారులు

పాణ్యం, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వాలు గృహ నిర్మాణ పథకం అమలు చేస్తున్నాయి. వేలాదిమందికి ఇళ్లు మంజూరు చేస్తున్నాయి. వాటి నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు చెల్లిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించింది. 2016- 19 మధ్య తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు నిలిపివేసింది. దీంతో అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టిన పేదలపై ఆర్థికభారం పడింది. వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు సైతం పూర్తిస్థాయిలో బిల్లులు అందించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత వైకాపా ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లతో పాటు ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి నిర్మాణ సర్వే చేస్తున్న ఏఈ అహమ్మద్‌బాషా

నియోజకవర్గం	మంజూరు అయిన ఇళ్లు	నిర్మాణం ప్రారంభం కానివి	నిర్మాణం పూర్తి అయినవి	వివిధ దశల్లో ఆగినవి
శ్రీశైలం	4577	738	1005	2834
నందికొట్కూరు	4072	544	1060	2642
నంద్యాల	2468	157	1389	922
పాణ్యం (పాణ్యం, గడివేముల)	1174	105	266	803

• నంద్యాల, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గంతో పాటు పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల మండలాల్లో ఎన్టీఆర్ గృహాలపై సర్వే సాగుతోంది. గడివేముల మండలంలో 654 ఇళ్లు మంజూరు కాగా 188 పూర్తయ్యాయి. 400 ఇళ్ల వరకు స్లాబ్ దశకు చేరాయి. పాణ్యం మండలంలో 520 ఇళ్లు మంజూరవ్వగా 304 స్లాబ్ దశలో ఆగిపోయాయి. 78 ఇళ్లు పూర్తయ్యాయి.

బిల్లులు మంజూరు చేస్తాం

- అహమ్మద్‌బాషా గృహ నిర్మాణశాఖ ఇంజినీరు, పాణ్యం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై సర్వే చేస్తున్నాం. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమైన నగదు వివరాలతో పాటు వివిధ దశల్లో నిలిచిన నిర్మాణాలు, పూర్తయిన ఇళ్లను గుర్తించి యాప్‌లో నమోదు చేస్తున్నాం. ఎన్టీఆర్ గృహాలకు త్వరలోనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది.

జల్సాల మోజుతో చోరీల బాట

■ పోలీసుల అదుపులో ఇద్దరు బాలలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు బాలలను నాలుగో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.ఆరు లక్షలు విలువ చేసే 7 తులాల బంగారు కడ్డీ, ద్విచక్ర వాహనం, ఐఫోన్, కెమెరా, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన ఇద్దరు బాలలు ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో అనంతపురంలోని తపోవనంలో ఓ ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. స్థానిక చంద్రబాబు కొట్టాలలోని ఓ ఫొటో స్టూడియో షట్టర్ ధ్వంసం చేసి అందులోని ఖరీదైన కెమెరా, బ్యాటరీ ఇతర సామగ్రిని, పామిడిలో మెడికల్ స్టోర్‌లో ఎలక్ట్రిక్ స్టార్టర్ పెట్టె, నగదు దొంగలించారు. వరుస చోరీలకు పాల్పడటంతో పోలీసులు దృష్టి సారించారు. నగరంలో చోరీల ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నారు. వీరిద్దరూ గంజాయి, మద్యానికి అలవాటు పడ్డారు. దానికితోడు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లపై మోజుతో వాటిని కొనడానికి, జల్సాలకు దొంగతనాలు చేసేవారు. వీరు చేసే నేరాలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం నాలుగో పట్టణ పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పరిచి, అనంతరం జువైనల్ హోంకు తరలించారు.

ఉద్యోగాలకు పలువురి ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎండీ దినేష్‌రెడ్డి, ప్రిన్సిపల్

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల టాబ్ అకాడమీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 15 మంది విద్యార్థులు ఉద్యోగావకాశాలు దక్కించుకున్నట్లు కళాశాల ఎండీ దినేశ్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగాలకు ఎంపికైనవిద్యార్థులను ఎండీతో పాటు ప్రిన్సిపల్ డా.మల్లికార్జునరెడ్డి, సిబ్బంది అభినందించారు.

ఆర్జీఎం, శాంతిరాం కళాశాలలకు జాతీయ ర్యాంకు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ప్రకటించిన స్కిల్స్ ఇంటర్న్‌షిప్ ర్యాంకులకు ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలు ఎంపికైనట్లు ఆయా కళాశాలల డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్త దిల్లీలోని అంబేడ్కర్ భవనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన కళాశాలలకు అవార్డులు అందజేశారన్నారు. ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముఖ్య సమన్వయకర్త డాక్టర్ రామ్మోహన్‌రావు చేతులమీదుగా అవార్డులు అందుకున్నామన్నారు. ఆర్జీఎంకు 3, శాంతిరాం కళాశాలకు 5వ ర్యాంకు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ సుబ్బారెడ్డి, భాస్కరరావు, ప్లేస్‌మెంట్ అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని రామకృష్ణ విద్యా సంస్థల ఛైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నేటి విద్యార్థులు విదేశీ విద్యకు, సంప్రదాయాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం స్ప్రింగ్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి జి.విజయకుమారి, డైరెక్టర్ జి.హేమంత్‌రెడ్డి, ఎస్టేట్ మేనేజనర్ జి.ప్రగతిరెడ్డి, స్ప్రింగ్ ఫెస్ట్ కన్వీనర్ ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే ముఖ్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : తమకు పదవుల కంటే ప్రజాసేవే ముఖ్యమని శిల్పా మహిళా బ్యాంకు ఛైర్‌పర్సన్ నాగినిరెడ్డి పేర్కొన్నారు. శిల్పా సేవా సమితి కార్యాలయంలో శనివారం ఆమె 200 మంది మహిళలకు రూ.30 లక్షల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర- 2047 లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు ప్రభుత్వ బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం మండల స్థాయి వక్తృత్వ, వ్యాస రచన, చర్చ పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో సనావుల్లా, వక్తృత్వ పోటీల్లో హర్షిణి, చర్చలో మదీహ, అస్మా ప్రథమ బహుమతులు గెలుపొందారు. ఇక్కడ గెలిచిన విద్యార్థులు ఈనెల 30న నంద్యాలలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-1 బాలాజీనాయక్, ఎంఈవో-2 సురేష్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా నాయకుడు రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. పాములపాడులో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్నలను శనివారం వారు పరిశీలించారు. వర్షాలతో పంటకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అరకొరగా వచ్చిన దిగుబడులు అమ్ముకుందామంటే దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

యాదవులు ఏకం కావాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : సమాజంలో మార్పు కోసం యాదవులంతా ఏకం కావాలని అఖిల భారత యాదవ సంఘం రాయలసీమ యువజన సంఘం అధ్యక్షుడు శివరామకృష్ణ, ఆత్మకూరు మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ బాలస్వామి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలో శనివారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాదవులంతా సభ్యత్వ నమోదులో పాల్గొనాలని కోరారు.

జాగ్రత్తలతో రేబిస్ నివారణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జాగ్రత్తలు పాటించడం ద్వారా రేబిస్ వ్యాధి బారినపడకుండా ఉండొచ్చని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. బైర్లూటిగూడెంలో శనివారం రేబిస్ వ్యాధి నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదవశాత్తు కుక్క కరిస్తే గాయాన్ని పలుమార్లు సబ్బుతో కడగి, ఆస్పత్రికి వెళ్లాలన్నారు. యాంటీ రేబిస్ టీకా వేయించుకోవాలన్నారు. సీహెచ్‌వో అహమ్మద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రంలో ఈనెల 3 నుంచి 12 వరకు జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు రావాలంటూ దేవస్థానం ఏఈవో ఎర్రమల మధు, వేదపండితులు ప్రముఖులను ఆహ్వానించారు. మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మహానంది నిత్యాన్నదానానికి శాశ్వత కూరగాయల దాతగా ఉన్న లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులతో పాటు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణాలకు శనివారం వారు నంద్యాలలో కలిసి ఆహ్వానం పలికారు.

తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రసవించిన చెంచు గూడేనికి చెందిన ఈరమ్మ, ఆమె బిడ్డ క్షేమంగా ఉన్నారని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో శనివారం నిర్వహించిన మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ విషయమై మాట్లాడుతూ.. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆసుపత్రికి తీసుకొచ్చింది వాస్తవమేనన్నారు. వైద్యసిబ్బంది ఆమెకు సుఖ ప్రసవం చేశారని, ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.

విద్యార్థులకు పోటీలు

గడివేముల, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర- 2047 అనే అంశంపై స్థానిక జడ్పీ పాఠశాల, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులకు శనివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో విమలా వసుంధరాదేవి తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు వివరించారు.

రహదారి వెడల్పు కుదింపుపై భగ్గుమన్న కౌన్సిలర్లు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పురపాలక సంఘంలోని ఎన్జీవోకాలనీ ప్రధాన రహదారి నుంచి లలితానగర్ వరకు 60 అడుగుల వెడల్పు ఉన్న రహదారిని రైల్వే ట్రాక్ పరిసరాల్లో 30 అడుగులకే కుదించాలన్న నిర్ణయంపై పురపాలక కౌన్సిలర్లు భగ్గుమన్నారు. నంద్యాల మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం ఛైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి నిర్వహించారు. బృహత్తర ప్రణాళికలోని రోడ్డును కుదించడం తగదని ఫ్లోర్‌లీడర్ మహబూబ్‌వలి అభ్యంతరం చెప్పారు. కుడా తీసుకున్న నిర్ణయం సరికాదని తెదేపా కౌన్సిలర్ శ్రీదేవి, కో-ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారిని కుదించారని వైస్‌ఛైర్మన్ పాంషావలి తెలిపారు. ఇందుకు మహబూబ్‌వలి అభ్యంతరం తెలుపుతూ ఇదొక్క ప్రాంతంలోనే పేదలు లేరని, అన్నిచోట్లా ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో మిగతా ప్రాంతాల్లో కూడా ఇదే సమస్య తలెత్తితే ఏమి చేస్తారని ప్రశ్నించారు. సభ్యులు కోరిక మేరకు ఈ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. 28వ వార్డు ప్లానింగ్ సెక్రటరీ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో భవనాలకు అనుమతులు ఇస్తున్నారని, ఈ అధికారం ఎవరిచ్చారని ఫ్లోర్‌లీడర్ మహబూబ్‌వలి ప్రశ్నించారు. ఛైర్‌పర్సన్ జోక్యం చేసుకుంటూ ఈ అంశంపై విచారణ జరపాలని కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలోని నాగులకుంట రోడ్డులోని పాలకొమ్మ చెట్టు స్థలంలో దుకాణాలు ఎలా నిర్మిస్తారని కౌన్సిలర్లు సాజిద్, కలాంలు ప్రశ్నించారు. అక్కడ అనుమతులు లేకుండా ఐదంతస్తుల భవనం నిర్మిస్తుంటే పట్టించుకోకుండా ఇప్పుడు విచారణ చేస్తామనడం తగదని కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ విమర్శించారు. దీంతో వైకాపా, తెదేపా కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ స్థలంపై పూర్తి నివేదిక ఇవ్వడంతో పాటు దస్త్రాలు పరిశీలించాలని ఛైర్‌పర్సన్ ఆదేశించడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామని ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా చెప్పారు. పురపాలక కార్యాలయంలో ఛైర్‌పర్సన్ అధ్యక్షతన కమిషనరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం మందిరం నిర్మాణం, కార్యాలయం స్టేషనరీ అంశాలను ఆమోదించారు. ఒప్పందాల ఆధారంగా పన్నుల విధింపు అంశాన్ని వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా మాట్లాడుతూ మురుగు కాల్వలు, నీటి సరఫరా, వీధిదీపాల సమస్యలు పరిష్కరించాలని కమిషనరు రమేష్‌బాబుకు సూచించారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్ రాజగోపాల్, కోఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రషీదు, కౌన్సిలర్లు సుగుణమ్మ, పార్వతి, గౌస్‌లాజం, విజయకుమార్, రంగస్వామి, విజయ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా

6న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : అక్టోబరు 6వ తేదీ నుంచి స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో ఐదు రోజుల పాటు జూనియర్స్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు సంబంధించిన బ్రోచర్లను శనివారం స్థానిక గురురాజ పాఠశాలలో డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి విడుదల చేశారు. దేశంలో 23 రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు క్రీడాకారులు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, దాస్, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పాణ్యం నియోజకవర్గ స్థాయి ఎస్జీఎఫ్ ఆటల పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎంపీపీ హుసేన్‌బీ, సర్పంచి పల్లవి, ఎంపీటీసీ సభ్యుడు రంగారమేష్, ఎంఈవో సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. పాణ్యం, ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు మండలాలకు చెందిన విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, తదితర పోటీలు నిర్వహించి విజేతలను బహుమతులు అందించారు. ఈ సందర్భంగా 90 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మేరీ సునీత, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నారాయణమ్మ, తెదేపా నాయకులు జయరామిరెడ్డి, రమణమూర్తి, లాయర్‌బాబు, రాంపుల్లారెడ్డి, ఖాదర్ బాషా, జనసేన మండల నాయకుడు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నాయకులు, అధికారులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ అమృత్‌కుమార్

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అమృత్‌కుమార్ శనివారం తెలిపారు. ఆత్మకూరులో ఈనెల 27న జరిగిన ఎస్జీఎఫ్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్‌లో రాణించారన్నారు. 13 మంది జిల్లాస్థాయికి, ఇద్దరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

గడివేముల, న్యూస్‌టుడే : నియోజకవర్గస్థాయిలో జరిగిన పోటీల్లో కరిమద్దెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 17 ఏళ్ల విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రాహుల్, కబడ్డీలో మనోజ్ఞ , 14 ఏళ్ల విభాగంలో కబడ్డీ పోటీల్లో నిర్మలాఇందు ఎంపికయినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు తెలిపారు.

ఎంపిక పోటీలు ప్రారంభం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం నూనెపల్లె పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎస్జీఎఫ్ నంద్యాల నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. గురురాఘవేంద్ర బ్యాంక్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ మౌలాలిరెడ్డి, ఎంఈవో శివరామ్ పోటీలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలపతి, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి శివకుమార్, నియోజకవర్గ కార్యదర్శి ఏపీరెడ్డి, పీఈటీల సంఘం గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, జిల్లా అధ్యక్షుడు దండే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైకాపా శ్రేణుల పూజలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం చంద్రబాబునాయుడు తిరుమల లడ్డూపై వ్యాఖ్యలు చేశారని వైకాపా నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు వ్యాఖ్యల వల్ల తిరుమల లడ్డూకు జరిగిన అపవిత్రతతను దూరం చేయాలని ప్రార్థిస్తూ స్థానిక గుడిపాటిగడ్డలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వారు ప్రత్యేక పూజలు చేశారు. వైకాపా నాయకులు చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బయ్య, శరత్, కౌన్సిలర్లు కృష్ణమోహన్, రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్, శేషయ్య పాల్గొన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : జగన్‌మోహన్‌రెడ్డిని దెబ్బతీసేందుకు తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయం చేస్తున్నారని నందికొట్కూరు నియోజకవర్గ వైకాపా బాధ్యుడు సుధీర్ దారా విమర్శించారు. శనివారం నందికొట్కూరు చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఆలిండియా యూత్ లీగ్ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నంద్యాల పట్టణం సాయిబాబానగర్‌లోని భగత్‌సింగ్ గ్రంథాలయం వద్ద ఆయన విగ్రహానికి ఏఐవైఎల్, సీపీఎం నాయకులు, డీవైఎఫ్ఐ నాయకులు నివాళి అర్పించారు. సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు భగత్‌సింగ్‌చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న యూత్ లీగ్, సీపీఎం నాయకులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలో సీపీఐ, సీపీఎం, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకుడు రఘురామ్మూర్తి, సీపీఎం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : జగనన్న కాలనీలో మంజూరు చేసిన ఇళ్లను గడువులోగా పూర్తి చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్ సూచించారు. పట్టణ శివారులో ఉన్న జగనన్న కాలనీలో శనివారం మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మార్చి 2025 వరకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బేబీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. పాణ్యంలో శనివారం మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రంగారమేష్, ఎంపీడీవో దస్తగిరి, ఈవోఆర్డీ సులోచన, ఏఈ అహమ్మద్‌బాషా, డీటీ మహేశ్వరరెడ్డి, ఈవో ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దీబగుంట్ల (గోస్పాడు) : దీబగుంట్లలో ఎంపీడీవో నాగ అనసూయ, ఏపీవో నాగజ్యోతి ఆధ్వర్యంలో శనివారం మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది, న్యూస్‌టుడే : లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ కోరారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామం రైతుసేవా కేంద్రంలో శనివారం మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంపై లబ్ధిదారులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. 2025 మార్చినాటికంతా ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని స్పష్టం చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్):: నంద్యాల కోర్టులో

E.P.No. 189/2019 IN O.S.No. 153/2013

కొప్పరపు రామసుబ్బయ్య, 62 సం॥లు, తండ్రి పెద్ద సుబ్బరాయుడు, ఇ.నెం.3/237-ఎ, కురువపేట, నంద్యాల టౌన్ & మండలం, కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా.) ...డి.హెచ్.ఆర్.

--వర్సెస్--

1) నామా సౌదామిని, 47 సం॥లు, భర్త ప్రభాకర్, గృహిణి, ఇ.నెం. 22-144, మహానందీశ్వరస్వామి టెంపుల్ దగ్గర, నంద్యాల టౌన్ & మండలం, కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా.)
2) ది కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్., నంద్యాల తరపున బ్రాంచ్ మేనేజర్, సౌజన్య కాంప్లెక్స్, నంద్యాల టౌన్ & మండలం, కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా.) ...జెడిఆర్స్

కోర్టు వేలం ప్రకటన

పై నెంబరు అమలు అర్జీలో డి.హెచ్.ఆర్. తనకు రావలసిన ఆయకం డిక్రీ బాకీ క్రింద 1వ జె.డి.ఆర్. పైన అమలు అర్జీ దాఖలు చేసి సదరు అమలు అర్జీ మొత్తం రాగోరి 1వ జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలులో కనపరచిన ఆస్తిని పైకోర్టు వారి ఎదుట తేది 17-10-2024 ఉదయం 10-30 గంటలకు బహిరంగ వేలం వేయుదురు. కావున సదరు వేలం రోజున కావలసిన సవాలుదార్లు హాజరై వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు : కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా.) నంద్యాల సబ్.డి.లో చేరిన నంద్యాల మున్సిపల్ లిమిట్స్‌కు లోనైన నంద్యాల గ్రామంలోని 22వ వార్డులోని ఇంటికి వివరం: ఇ.నెం.22-144- ఫస్ట్ ఫ్లోర్‌లో 3 రూములు గలది. సర్వేనెం. 888 పైకి.
దిశలు :- తూర్పు : శ్రీ మహానందీశ్వర స్వామి టెంపుల్, **పడమర :** కొండారెడ్డి మిద్దె యిల్లు, **ఉత్తరం :** శ్రీ మహానందీశ్వర స్వామి టెంపుల్, **దక్షిణం :** రోడ్డు.
స్థలం కొలతలు :- తూ-ప : 23 అడుగులు, **ఉ-ద :** 31 1/4 అడుగులు, **గ్రౌండ్ ఫ్లోర్ కొలతలు :- తూ-ప :** 23 అడుగులు, **ఉ-ద :** 31 1/4 అడుగులు, **మొదటి రూము కొలతలు : తూ-ప :** 23 అడుగులు, **ఉ-ద :** 14 అడుగులు, **మొదటి రూముకు దక్షిణం దిశన గల రెండవ రూముకు కొలతలు :- తూ-ప :** 7 అడుగులు, **ఉ-ద :** 14 అడుగులు, **రెండవ రూముకు పడమర దిశన గల 3వ రూము జింక్ షీట్ షెడ్‌పు కొలతలు :- తూ-ప :** 13 1/2 అడుగులు, **ఉ-ద :** 9 అడుగులు, **మొత్తం స్థల విస్తీర్ణం :** 80 చ.గ.లు, **కట్టడపు విస్తీర్ణం (ప్లింత్ ఏరియా) :** 1139 చ.అ.లు - కడప స్లాబ్, 122 చ.అ.లు - జింక్ షీట్. తూర్పు, పడమర, ఉత్తరం దిశల గోడపార్లలో 1/2 అర్ధం గోడపారు హక్కులున్నూ, దక్షిణం దిశ గోడపారులో పూర్తి గోడపారు హక్కున్ను కలదు.
డి.హెచ్.ఆర్. విలువ : రూ. 20,00,000/– అమీనా విలువ : రూ. 35,00,000/–
యస్.ఆర్.ఓ. విలువ : రూ. 27,48,700/–లు
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు) వేలం తేది : 17–10–2024
నోట్ : ఈ.సి.లో ఎలాంటి తగాదాలు లేవు
సం/- శ్రీ రాచకొండ నటరాజ్, డి.హెచ్.ఆర్. పరం అడ్వకేట్, నంద్యాల. సెల్ : 94407 54781.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రిక విడుదల


ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : పట్టణంలోని కాళికామాతాలయంలో శనివారం శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురుగడ్డ రవీంద్రాచారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వరకు శరన్నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విరాళాల సేకరణ

ప్యాపిలి,న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపడుతున్నట్లు యూటీఎఫ్ మండల సహాధ్యక్షులు రమేష్ నాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థుల చేత విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మాబాయి, రాజేంద్ర, నెల్లూరప్ప పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

డోన్‌పట్టణం,
సమస్య : శ్రీనివాసనగర్‌లో ప్రధాన రహదారి పక్కన రెండు వీధి దీపాలు వెలగడం లేదు.
- రాముడు, శ్రీనివాసనగర్
సమాధానం: దీపాలను ఏర్పాటు చేయిస్తాం.
- సురేష్, మున్సిపల్ ఏఈ

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మాయలూరు (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే : సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని నంద్యాల జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. ఉయ్యాలవాడ మండలంలోని మాయలూరు ప్రాథమిక ఆరోగ్య


వైద్యశాలను తనిఖీ చేసిన వైద్యాధికారి వెంకటరమణ

కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మలేరియా, టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధుల సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీటిని కాచి వడబోసి తాగాలని సూచించారు.

సేవలలో ప్రథమం స్థానం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : కోవెలకుంట్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రం చిన్న పిల్లల విభాగానికి సంబంధించి ఎన్టీఆర్ సేవా ట్రస్టు (ఆరోగ్యశ్రీ) సేవలు అందించడంలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి డాక్టర్ జఫ్రుల్లా పేర్కొన్నారు. కోవెలకుంట్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో ఎక్కడ లేని విధంగా కోవెలకుంట్లలో చిన్న పిల్లల విభాగానికి సంబంధించి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి 55 కేసులకు ఎన్టీఆర్ సేవా ట్రస్టు కింద వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు.

కాలి బాటల్లేక.. పాదచారుల అవస్థలు


రైల్వేస్టేషన్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహనాలు

డోన్ పట్టణం న్యూస్‌టుడే : పట్టణాల్లో రహదారికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లకి అంతే ప్రాముఖ్యత ఉంటుంది. రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలకు ఇబ్బందులు లేకుండా, నడుచుకుంటూ వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కాలిబాటలను నిర్మించాలి. కానీ డోన్ పట్టణం పరిధిలో మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కానీ రైల్వేస్టేషన్ రోడ్డులో 2021-22లో చేపట్టిన రహదారి విస్తరణలో భాగంగా ఫుట్‌పాత్‌లను రూ.35లక్షలతో నిర్మించారు. రోడ్డుకు ఇరువైపుల 700మీటర్ల పొడవుతో, 6అడుగుల వెడల్పుతో నిర్మించారు. ఈ కాలిబాటలను కొందరు వ్యాపారులు పలుచోట్ల ఆక్రమించేశారు. అయినా పట్టించుకొనే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.


ఉపరితల వంతెన కింద రహదారి పక్కనే నిలిపిన వాహనాలు

పట్టణంలో ఎక్కడెక్కడంటే..

- పట్టణంలో బేతంచెర్ల ప్రధాన రహదారిలో రైల్వే డబ్లింగ్ లైన్ ఏర్పాటుతో రోడ్డు పక్కనే ప్రహరీని నిర్మించారు. దీంతో రహదారి కుచించుకుపోయింది. చిన్నపాటి రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేవిధంగా పాదచారులు నడిచేందుకు అవస్థలు తప్పడం లేదు.
- గుత్తి రోడ్డులో గ్రంథాలయం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు ఉన్న ఉపరితలం వంతెన ఇరువైపుల రహదారులు పక్కన ద్విచక్రవాహనాలు, ఆటోలను నిలుపుతున్నారు. ఇరుకైన దారిలో పాదచారులు నడిచేందుకు అవస్థలు పడుతున్నారు.
- ఎల్ఐసీ కార్యాలయం వద్ద రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను నిలపడం, పాత బస్టాండులో ఫర్టిలైజర్ షాపు వీధిలో, కంబాలపాడు సర్కిల్‌లో దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు ఆటోలను నిలుపుతున్నారు. ఈ దారిలో విద్యార్థులు, ప్రజలు నడిచేందుకు ఇక్కట్లు పడుతున్నారు. పట్టణంలోని కొత్తపేట, కొండపేట, తదితర ప్రాంతాల్లోని వీధుల్లో ఇదే పరిస్థితి ఉంది.
- పాతపేట మెయిన్ బజార్, పూలమార్కెట్ బయట, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కూడా ఇదే దుస్థితి.

అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత

మున్సిపల్ పరిధిలో చాలా ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో కాలిబాటలు లేక రోడ్లపైనే పాదచారులు నడవాల్సిన పరిస్థితి ఉంది. తోపుడుబండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పండ్ల వ్యాపారాలతో పాటు ద్విచక్రవాహనాలు, మినీ వ్యాన్లు, కార్లను రోడ్డుకు అడ్డంగా నిలిపి వ్యాపారాలు సాగిస్తున్నారు. నిత్యం ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ట్రాఫిక్ అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని ప్రజలందరూ భావించిన నేటికి ట్రాఫిక్ సమస్య తీరలేదు.

వాహనాలను నిలుపుతుండటంతో పాదచారులు నడవలేని పరిస్థితి.

- పాత బస్టాండులో సమైక్యాంధ్ర కట్ట సమీపం నుంచి బస్సులు నిలిపే ప్రాంతం వరకు తోపుడుబండ్ల ఏర్పాటుతో, వాహన రాకపోకలతో పాదచారులు నడిచేందుకు ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది. రైల్వేస్టేషన్ రోడ్డులోనూ అదే పరిస్థితి. ఫుట్‌పాత్‌లు లేక ప్రజలు రోడ్లపై నడవాల్సి రావడంతో వాహనాలు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏటా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జాగ్రత్తలు తీసుకోకపోతే ఆర్థిక నష్టం

డోన్, న్యూస్‌టుడే : కందిపూత సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఆర్థికంగా రైతలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకురాలు సరళమ్మ

సహాయ సంచాలకురాలు సరళమ్మ అన్నారు. శనివారం స్థానిక మార్కెట్టు యార్డులో డోన్ సబ్ డివిజన్‌లోని రైతు సేవాకేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పూర్తి చేయాలి

ప్యాపిలి : ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన పెండింగ్ క్లెయిమ్స్‌ను సత్వరమే విచారించి పూర్తి చేయాలని తహసీల్దార్ భారతి వీఆర్వోలకు సూచించారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు సమావేశాన్ని నిర్వహించారు.

ప్రశాంతమైన జీవితాన్ని గడపాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు, లేకుండా ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సీఐ వెంకట్రామిరెడ్డి, జలదుర్గం ఎస్సై నాగార్జునలు పేర్కొన్నారు. జలదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని ఊటకొండ, మాధవరం, రామకృష్ణాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను శనివారం సందర్శించారు.

నాయకులు అరెస్టు విడుదల

డోన్ నేరవిభాగం: శనివారం మాజీ మంత్రి బుగ్గన స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అడ్డుకోబోయిన భాజపా నాయకులను పోలీసులు అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు.

రైతులకు అండగా నిలవండి

డోన్, న్యూస్‌టుడే : రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి శనివారం ఎంపీ బైరెడ్డి శబరీ స్వగృహంలో ఆమెను, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ, బైరెడ్డిలను శాలు


ఎంపీ బైరెడ్డిశబరి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలను కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

వలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఎన్నో పదవులను అలంకరించి ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు కోరారు. రైతులకు మేలు జరిగేలా చూడాలని ధర్మవరానికి సూచించారు. కృష్ణగిరి మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు కేఈజయన్న దంపతులను కూడా ధర్మవరం కలిశారు. కార్యక్రమంలో యువనాయకులు గౌతంరెడ్డి, పట్టణ అధ్యక్షులు సీఎంశ్రీను, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

డోన్, న్యూస్‌టుడే : డోన్ పట్టణంలోని రోటరీ ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణలో భాగంగా దాతలు ఇచ్చిన విరాళాన్ని రోటరీ సభ్యులు శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్లకు ఆయన స్వగృహంలో అందజేశారు. రోటరీ సభ్యులు మాట్లాడుతూ దాదాపు రూ.25 వేల రుపాయలను కోట్లకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు రాజావిజయ్‌కుమార్, వెంకటరాముడుగౌడ్, లక్ష్మిరెడ్డిషా, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కోట్లకు చెక్కు అందిస్తున్న రోటరీ సభ్యులు

విద్యార్థులు సోదర భావంతో చదువుకోవాలి

బనగానపల్లి న్యూస్‌టుడే : విద్యార్థులు సోదర భావంతో కలిసిమెలిసి చదువుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సూచించారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు


బీసీ ఇందిరమ్మకు సన్మానం చేస్తున్న కళాశాల సిబ్బంది

చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమకు ఇష్టమైన రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో కళాశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆవరణంలో మొక్కలు నాటారు. ఇందిరమ్మను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.వేణుగోపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

చాగలమర్రి, న్యూస్‌టుడే :జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శాస్త్రీలకు ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవా


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఏపీయూఎస్ నాయకులు

ర్డులు అందాయి. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కోటయ్య అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. ఏపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రావు, ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, పాల్గొన్నారు.

విద్యార్థుల మేదస్సుకు సైన్సు పరీక్షలు

బేతంచెర్ల న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న మేదస్సును వెలికి తీసేందుకు సైన్సు పరిజ్ఞాన పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మరియదాసు అన్నారు. శనివారం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక సహకారంతో చెకుముకి సైన్సు పరీక్షలు నిర్వహించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఉయ్యాలవాడ న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కింద నియోజకవర్గ స్థాయిలో అండర్ 14 బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మాయలూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పట్నం జేమ్సు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్. ఎం. షరీఫ్, వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవగౌడ్ పేర్కొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే : మండలంలోని ఆకుమల్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరెడ్డి తెలిపారు.


విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

రాష్ట్రస్థాయికి ఎంపిక

రుద్రవరం న్యూస్‌టుడే : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో రెజ్లింగ్, కబడ్డీ, అండర్-14 విభాగంలో షాట్‌పుట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 26వ తేదీన కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19లో రెజ్లింగ్‌లో పావని, నాగదినేష్, ఫరూక్, సాయికుమార్, శశిధర్, కుమారి, ప్రవళిక, చింటూ, మహేశ్వరీ, స్నేహలతలు, అండర్-14లో షాట్‌పుట్‌లో తాజ్‌బాబా ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అబ్దుల్ రజాక్, అబ్దుల్ రెహమాన్, యాసిన్, సుమంత్‌లు ఈనెల 25న నంద్యాలలో జరిగిన టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

క్రీడాభివృద్ధికి రూ.1.4కోట్లు

చాగలమర్రి, న్యూస్‌టుడే : జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన ఉన్నత పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం రూ. 1. 4కోట్లు నిధులు మంజూరు చేసిందని సమగ్రశిక్షా డీఈ నాగభూషణంరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎంశ్రీ కింద 28పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. ప్రతి పాఠశాలకు రూ. 5లక్షలు మంజూరయ్యాయన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

తిమ్మాపురం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే : బనగానపల్లి మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఉపాధిహామీ నిధులతో పండించిన ఉద్యానతోటలను ఉమ్మడి జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి సురేంద్రబాబు శనివారం పరిశీలించారు.

నిర్మాణాన్ని వేగవంతం చేయండి

అవుకు, న్యూస్‌టుడే : పేద ప్రజల గౌరవాన్ని కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ సూచించారు.

విద్యార్థులకు మండలస్థాయిలో పోటీలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సందర్భంగా మండలస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు పలు రకాల పోటీలను శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వీటిని ఎంఈవోలు ప్రభాకర్, రామనర్సప్పలు పర్యవేక్షించారు.

లడ్డూపై అసత్య ఆరోపణలు

బనగానపల్లి న్యూస్‌టుడే : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదంపై తెదేపా అసత్య ఆరోపణలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం కాటసాని కార్యకర్తలతో కలిసి స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

రాజకీయ కోసం అపవిత్రం చేశారు

డోన్ పట్టణం న్యూస్‌టుడే : తిరుమల పవిత్రతను, తిరుమల లడ్డూ ప్రసాదాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర సీఎం చంద్రబాబు అపవిత్రం చేశారని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్ఎన్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సామాజిక సేవకు పురస్కారం

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జెకెఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందచారికి చిలకలూరిపేటకు చెందిన జయజయసాయి ట్రస్టు వారు ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి సాయిబాబా జాతీయ సేవా పురస్కారం ఇచ్చారు.

అవగాహనతో రేబిస్ వ్యాధిని నివారించవచ్చు

చాగలమర్రి న్యూస్‌టుడే : గ్రామాల్లో పెంపుడు జంతువుల పెంపకం దారులు రేబిస్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుంటే వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండొచ్చని పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాదు తెలిపారు. పట్టణం


అవగాహన కల్పిస్తున్న ఏడీ వరప్రసాదు

లోని ప్రాంతీయ పశువైద్యశాలలో శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువుల పెంపకం దారులకు రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కోటయ్య, శంకరమ్మ పాల్గొన్నారు.

ప్యాపిలి న్యూస్‌టుడే : రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విద్యాబోధకుడు రాఘవేంద్రగౌడ్, డిప్యూటీ పారామెడికల్ అధికారి రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం రేబిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక శిశుమందిరం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డోన్, న్యూస్‌టుడే : కుక్క కాటు ఎంతో ప్రమాదకరమని, 2030 నాటికి రేబిస్ వ్యాధి మరణాలు లేకుండా చేయాలని పశువైద్యశాఖ ఏడీ నాగరాజు అన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : బనగానపల్లి మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నిఘానేత్రాలను శనివారం నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఫ్యాక్షన్ మూలాలున్న గ్రామం కావడంతో గ్రామంలో నాలుగు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

గ్రామంలో ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో జీవించాలని సూచించారు.

నవరాత్రి ఉత్సవాల్లో డీజేలు నిషేధం

బేతంచెర్ల న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాల్లో డీజేలను నిషేధిస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో డీజేలు ఏర్పాటు చేయడంతో గందరగోళం చోటుచేసుకుందన్నారు. చాలా మందికి వినికిడి, ఇతరాత్ర అనారోగ్య సమస్యలు తలెత్తాయన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపులో డీజేలను అనుమతించమని సీఐ వెల్లడించారు. ఎవ్వరైన పోలీసు నిబంధనలను దిక్కరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

గుంత ఆదమరిస్తే చింత



బనగానపల్లి పట్టణంలో పెండేకంటి నగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కనే గుంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి నుంచి చిన్నారులు పాఠశాలలకు వెళతుంటారు. ఈ రోడ్డు నుంచి ద్విచక్ర వాహనదారులు, నాలుగు చక్రాల వాహనాలు వెళతుంటాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే బనగానపల్లి,

మొక్కే అని వదిలేస్తే.. తప్పదు భారీ మూల్యం

మొక్క కదా అని వదిలేస్తే భారీ మూల్యం తప్పదని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టణంలోని చిగురుమానుపేటలోని ట్యాంకుకు రావిమొక్కలు అలుముకున్నాయి. దీని వేర్లు ట్యాంకు గోడలోకి వెళ్లి బీటలు వాలే ప్రమాదం ఉంది. తొలి దశలోనే వీటిని తొలగించి ట్యాంకులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే డోన్‌పట్టణం,



భగత్‌సింగ్‌కు ఘన నివాళి


డోన్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


బేతంచెర్ల : నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని నాయకులు, ఉపాధ్యాయులు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు ఇదే రోజు జన్మించిన గుర్రం జాషువాకు సైతం నివాళి అర్పించారు.


ఆళ్లగడ్డ : భగత్ సింగ్, గుర్రం జాషువాల చిత్రపటాలకు నివాళి

నిఘా నేత్రం.. నిద్రపోతోంది

ఆళ్లగడ్డ న్యూస్‌టుడే : పోలీసులు శాంతి భద్రతలను కాపాడటం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటారు. రక్షకభటుల శ్రమకు సాంకేతికత తోడైతే విధి నిర్వహణ మరింత సులభతరం అవుతుంది. దీంతో నిఘా నేత్రాల ఏర్పాటుకు పోలీసు శాఖ మొగ్గుచూపుతుంది. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వ్యాపారులు, ప్రజల నుంచి విరాళాలు సేకరించి నిఘానేత్రాలను ఏర్పాటు చేశారు. రూ. లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన కెమెరాలు సక్రమంగా పనిచేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయి. కానీ చాలాచోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పోలీసు శాఖకు మూడో కన్నుగా పరిగణించే ఈ వ్యవస్థకు నిర్వహణ లోపాలు శాపంగా మారుతున్నాయి.


ఆళ్లగడ్డ జాతీయ రహదారి కూడలి వద్ద కెమెరాలు పనిచేయని దుస్థితి

ఆళ్లగడ్డలో పనిచేయని కెమెరాలు

ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలో ఐదేళ్లుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో నాణ్యత సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి గాలివానకే దెబ్బతింటున్నాయి. 2022లో దాతల సాయంతో 43 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ అందులో ఏవీ పనిచేయడం లేదు. ముఖ్యంగా జాతీయ రహదారుల కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం తీవ్ర సమస్యగా మారింది.

☛ ఈ నెల 23వ తేదీన మందలూరుకు ఒక వ్యక్తి కారులో వెళ్తుండగా నాలుగు రహదారుల కూడలిలో ద్విచక్ర వాహనదారుడు నిర్లక్ష్యంగా వచ్చి కారును ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. బాధిత వ్యక్తి పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఢీకొన్న వ్యక్తిని గుర్తించలేని పరిస్థితి.

☛ గత నెలలో ఇసుక టిప్పర్లు సీసీ కెమెరాల నిర్వహణ వ్యవస్థ ఉన్న స్తంభాన్ని ఢీ కొట్టడంతో పట్టణంలోని అన్ని నిఘానేత్రాలు పనిచేయని పరిస్థితి నెలకొంది. దీనికి మరమ్మతులు చేపట్టాలంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు సమకూర్చాల్సిన పరిస్థితి నెలకొంది.

డోన్‌లో కానరాక.. ప్రమాదాలు నివారించక

డోన్ పురపాలక పరిధిలో వ్యక్తిగత, పోలీసు శాఖకు సంబంధించినవి కలిపి మొత్తం 756 కెమెరాలు ఉన్నాయి. అయినా కొన్ని కీలక ప్రాంతాల్లో మాత్రం కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఈ మధ్యకాలంలో ద్విచక్ర వాహనాల చోరీలు అధికంగా జరుగుతున్నా నేరస్థులను పట్టుకోవడం సమస్యగా మారింది.

☛ బనగానపల్లి పట్టణంలో కేవలం 25 కెమెరాలు మాత్రమే ఉన్నాయి. అందులోనూ కొన్ని పనిచేయడం లేదు. అవుకు మెట్ట, కోవెలకుంట్ల రోడ్డు, నంద్యాల రహదారి, గుత్తిరోడ్డు ప్రాంతాల్లో సీసీ కెమెరాల పనితీరు సంతృప్తికరంగా లేదు. పట్టణంలోకి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో నిఘానేత్రాలు ఉంటే నేరాలను ఛేదించేందుకు సులువుగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు, ఖర్చుతో కూడుకున్న అంశం

- చిరంజీవి సీఐ, ఆళ్లగడ్డ పట్టణం

ఆళ్లగడ్డ పట్టణంలో సీసీ కెమెరాల వ్యవస్థ పనిచేయాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంది. దీని కోసం ఎలా ముందుకెళ్లాలో తెలియని పరిస్థితి ఉంది. సీసీ కెమెరాలు లేకపోవడంతో నేరస్థులను గుర్తించలేని స్థితి నెలకొంది.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : రామతీర్థం గ్రామ శివారులోని అడవిలో నాటుసారా బట్టీలపై నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై కేసుల నమోదు

బేతంచెర్ల న్యూస్‌టుడే : మండలంలోని బలపాలపల్లె గ్రామ సమీపంలో కొండ ప్రాంతంలో సారా బట్టీలు తయారుచేస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గ్రామానికి చెందిన దుబ్బగాళ్ల మద్దిలేటిస్వామి, దుబ్బగాళ్ల ఎల్లయ్య, గౌరిగాళ్ల శేఖర్ ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేక్షావలి తెలిపారు.

డీటీఆర్ కాపర్ తీగలు చోరీ

ప్యాపిలి, న్యూస్‌టుడే : కేవీఏ 16 సింగిల్ ఫేస్ డీటీఆర్ కాపర్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు విద్యుత్తుశాఖ ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిలో ఉన్న 16కేవీఏ ప్రాంతాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ విషయంపై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : మండలంలోని అమడాల గ్రామంలో 27న జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేశామని ఎస్సై మల్లికార్జునరెడ్డి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన చెన్నుడుకు చెందిన ఇంట్లో అదే గ్రామానికి చెందిన రామమద్దిలేటి దొంగతనానికి పాల్పడ్డాడు. మూడు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లగా నిందితుడిని అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.